## 287 వ అధ్యాయం

## ٢٨٧ ـ بَابُ تَغْلِيظِ تَحْرِيمِ الرِّبَا
## వడ్డీ కఠినంగా నిషేధించబడింది

قَالَ اللهُ تَعَالَى: ﴿ ٱلَّذِينَ يَأْكُلُونَ ٱلرِّبَوٰا۟ لَا يَقُومُونَ إِلَّا كَمَا يَقُومُ ٱلَّذِى يَتَخَبَّطُهُ ٱلشَّيْطَـٰنُ مِنَ ٱلْمَسِّ ۚ ذَٰلِكَ بِأَنَّهُمْ قَالُوٓا۟ إِنَّمَا ٱلْبَيْعُ مِثْلُ ٱلرِّبَوٰا۟ ۗ وَأَحَلَّ ٱللَّهُ ٱلْبَيْعَ وَحَرَّمَ ٱلرِّبَوٰا۟ ۚ فَمَن جَآءَهُۥ مَوْعِظَةٌ مِّن رَّبِّهِۦ فَٱنتَهَىٰ فَلَهُۥ مَا سَلَفَ وَأَمْرُهُۥٓ إِلَى ٱللَّهِ ۖ وَمَنْ عَادَ فَأُو۟لَـٰٓئِكَ أَصْحَـٰبُ ٱلنَّارِ ۖ هُمْ فِيهَا خَـٰلِدُونَ ﴿٢٧٥﴾ يَمْحَقُ ٱللَّهُ ٱلرِّبَوٰا۟ وَيُرْبِى ٱلصَّدَقَـٰتِ ﴾ إلى قَوْلِهِ تعالى: ﴿ يَـٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ ٱتَّقُوا۟ ٱللَّهَ وَذَرُوا۟ مَا بَقِىَ مِنَ ٱلرِّبَوٰٓا۟ ﴾ [البقرة: ٢٧٥ـ٢٧٨].

وَأَمَّا الأَحَادِيثُ فَكَثِيرَةٌ فِي الصَّحِيحِ مَشْهُورَةٌ، ، مِنْهَا حَدِيثُ أَبِي هُرَيْرَةَ السَّابِقُ فِي الْبَابِ قَبْلَهُ.

దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "వడ్డీ తినేవారి స్థితి షైతాను పట్టటం వల్ల ఉన్మాది అయిన వ్యక్తి స్థితి లాంటిది. ఈ స్థితికి వారు గురికావటానికి కారణం వారు "వ్యాపారం కూడా వడ్డీ లాంటిదేగా" అని అనటమే. వాస్తవానికి అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మసమ్మతం (హలాల్) చేశాడు. వడ్డీని నిషిద్ధం (హరామ్) చేశాడు. కనుక తన ప్రభువు చేసిన ఈ హితబోధ అందే వ్యక్తి మున్ముందు వడ్డీ తినటం త్యజిస్తే, అతను పూర్వం తిన్నదేదో తిన్నాడు. అతని వ్యవహారం చివరకు అల్లాహ్ వద్దకే పోతుంది. ఈ ఆదేశం తర్వాత మళ్ళీ ఈ దుశ్చేష్టకు పాల్పడే వాడు నిశ్చయంగా నరకవాసి. అక్కడ అతడు శాశ్వతంగా ఉంటాడు. అల్లాహ్ వడ్డీని నశింప జేస్తాడు. దాన ధర్మాలను పెంచి అధికం చేస్తాడు. కృతఘ్నుడూ, దుష్టుడూ అయిన వ్యక్తిని అల్లాహ్ ప్రేమించడు. కాని విశ్వసించి మంచి పనులు చేసేవారికి, నమాజును స్థాపించే వారికి, జకాత్‌ను ఇచ్చేవారికి వారి ప్రభువువద్ద తగిన ప్రతిఫలం లభిస్తుంది. వారికి భయంకాని, శోకంకాని కలిగే అవకాశం లేదు."

"విశ్వసించిన ప్రజలారా! మీరు నిజంగా విశ్వాసులే అయితే, అల్లాహ్‌కు భయపడండి. ఇంకా మీకు ప్రజల నుండి రావలసిన వడ్డీని విడిచి పెట్టండి." *(అల్ బఖర: 275-278)*

పోతే దీనికి సంబంధించిన సుప్రసిద్ధమైన

హదీసులు 'సహీహ్'లో ఎన్నో ఉన్నాయి. వాటిలో ఇంతకు ముందు అధ్యాయంలో వచ్చిన అబూహురైరా (రజి) హదీసు కూడా ఉంది.

١٦١٧ - وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللهُ عَنْهُ قَالَ: «لَعَنَ رَسُولُ اللهِ ﷺ آكِلَ الرِّبَا وَمُوكِلَهُ» رواه مسلم. زاد الترمذي وغيره: «وَشَاهِدَيْهِ، وَكَاتِبَهُ».

1617. హజ్రత్ ఇబ్నె మస్ఊద్ (రజి) కథనం ప్రకారం వడ్డీ తినేవారిని, తినిపించేవారిని దైవప్రవక్త (సల్లం) శపించారు (ముస్లిం).

తిర్మిజీ తదితరులు అదనంగా "వడ్డీ వ్యవహారానికి సాక్షులుగా ఉండే వారిద్దరినీ, ఆ వ్యవహారం రాసే వాణ్ణి కూడా శపించారు" అని పేర్కొన్నారు.

(సహీహ్ ముస్లింలోని ముసాఖాత్ ప్రకరణం - సుననె తిర్మిజీలోని లావాదేవీల అధ్యాయాలు)

## ముఖ్యాంశాలు

వడ్డీ తినేవారు, తినిపించేవారంటే వడ్డీలకు డబ్బు ఇచ్చిపుచ్చుకునేవారని భావం. ఈ హదీసు వడ్డీ వ్యవహారాన్ని కఠినంగా నిషేధిస్తోంది. ఇచ్చిపుచ్చుకునేవారిని మాత్రమే కాకుండా ఆ వ్యవహారానికి సాక్షులుగా ఉండేవారిని, దాన్ని రాసేవారిని కూడా అందులో శపించటం జరిగింది. మరి చూడబోతే సాక్షులకు, రాతగాళ్ళకు ఆ వ్యవహారంలో ఎలాంటి భాగస్వామ్యం ఉండదు. కాని ఒకింత సహాయం అందజేసినందుకు వారిని కూడా శాపగ్రస్తులుగా పేర్కొనటం జరిగింది. కనుక వడ్డీ వ్యవహారానికి ఏ మాత్రం సహాయసహకారాలు అందజేసినా అది కూడా దైవాగ్రహానికి, దేవుని శాపానికి కారణభూత మవుతుంది. అయితే వడ్డీని ఇంత కఠినంగా నిషేధించటానికి కారణం ఏమిటి? అంటే ఇస్లాం ధర్మం సానుభూతి, సౌభ్రాతృత్వం, త్యాగం, పరోపకార భావాల మీద ఆధారపడి ఉండే సమాజాన్ని నెలకొల్పగోరుతుంది. ఎవరికైనా ధనం అవసరమయితే సమాజంలోని ధనవంతులు దైవమార్గంలో, దేవుని ప్రసన్నత కోసం ఉచితంగా వారి ధనావసరాన్ని పూర్తి చేయాలి లేదా ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా వారికి ధనం అప్పుగా ఇవ్వాలి. ఇస్లాం స్థాపించగోరుతున్న సమాజం ఇలాంటి ఉన్నతమైన విలువల్ని కలిగి ఉంటుంది. కాని వడ్డీ వ్యవస్థ దీనికి భిన్నంగా స్వార్థం, దురాక్రమణ, దౌర్జన్యం మీద ఆధారపడి ఉంటుంది. ఈ వ్యవస్థలోని ధనవంతులెవరూ దైవప్రసన్నత కోసం ధన సహాయం చేయరు. వారు ఎప్పుడూ తమ స్వార్థం గురించే ఆలోచిస్తూ ఉంటారు. పేదవాని శరీరం నుండి చివరి

రక్తపు బొట్టును పిండుకున్నప్పటికీ వారి ధనాశ తీరదు. అందుకని ఇస్లాం ధర్మం అన్నిరకాల వడ్డీ వ్యవహారాలనూ నిషేధించింది. వ్యక్తిగత అవసరాల నిమిత్తం తీసుకున్న రుణం మీద లేక వ్యాపార ఉద్దేశ్యాల కోసం తీసుకున్న రుణం మీద దేనిమీదనయినా సరే; అది వడ్డీ పుచ్చుకోవటాన్ని సహించదుగాక సహించదు.

"ఆనాడు అరబ్బుల్లో వర్తక వ్యాపారాల కోసం అప్పు ఇచ్చి పుచ్చుకునే పద్ధతి ఉండేది కాదు. కేవలం కుటుంబ అవసరాల కోసమే ప్రజలు అప్పు తీసుకునేవారు. కనుక ఇస్లాం నిషేధించింది కుటుంబ అవసరాల నిమిత్తం రుణం ఇచ్చి దాని మీద తీసుకునే వడ్డీనేగాని వ్యాపార లావాదేవీల నిమిత్తం ఇచ్చేరుణం మీద తీసుకునే వడ్డీని కాదు, అసలు ఆ కాలంలో వ్యాపార లావాదేవీల నిమిత్తం వడ్డీలకు రుణమిచ్చే ఆచారమే లేదు" అని కొంతమంది అంటారు. కనుకనే వారు వ్యాపార సంబంధ రుణం మీద వడ్డీ తీసుకోవచ్చని చెబుతారు. దాన్ని 'వర్తక వడ్డీ' గా పేర్కొంటారు. వాళ్ళ అభిప్రాయంలో ఈ రకమైన వడ్డీ నిషిద్ధం కాదు, ఎందుకంటే ఇలాంటి రుణాలతో రుణగ్రహీతలు బాగా లాభాలు గడిస్తారు. అలాంటప్పుడు ఆ లాభంలో నుంచి సంవత్సరానికి ఒక నిర్ణీత భాగం రుణదాతకు ఇస్తే అది అధర్మం ఎలా అవుతుంది? నిజానికి అది ధనం అప్పుగా ఇచ్చినందుకు రుణదాతకు లభించవలసిన హక్కు అన్నది వారి వాదన- కాని ఈ వాదన సరైనది కాదు. దానికి అనేక కారణాలున్నాయి. ఒకటేమిటంటే అరబ్బుల్లో వ్యాపార నిమిత్తం రుణం ఇచ్చిపుచ్చుకునే ఆచారం ఉండేది కాదన్న వాదనలో నిజం లేదు. ఎందుకంటే అరబ్బులు వర్తకవ్యాపారాల కోసం కూడా రుణాలు తీసుకునేవారని చరిత్రలో అనేక దాఖలాలున్నాయి. మరో విషయం ఏమిటంటే వ్యాపారంలో పెట్టిన పెట్టుబడికి తప్పకుండా లాభమే వస్తుందని నమ్మకంగా చెప్పలేము. సాధారణంగా మనం చూస్తూ ఉంటాం. వ్యాపారంలో కొన్నికొన్ని సార్లు లక్షల, కోట్ల రూపాయల నష్టం వస్తుంది. కాని బ్యాంకులు, షావుకార్లు అవేవీ పట్టించుకోరు. ఎట్టి పరిస్థితుల్లోనయినా వారు ప్రతి సంవత్సరం నిర్ణీత మొత్తంలో తమ పెట్టుబడికి 'వడ్డీ'ని వసూలు చేసుకుంటారు. మరి ఇది దౌర్జన్యం కాదా? స్వార్థప్రియత్వం కాదా? పరుల సొమ్మును అన్యాయంగా దోచుకు తినటం కాదా?! సరే ఒకవేళ వ్యాపారంలో నష్టం లేకుండా లాభమే వచ్చిందనుకోండి. అప్పుడు కూడా ఈ వడ్డీ రుణాల మూలంగా బాధలు తప్పవు. వీటివల్ల వస్తువుల ధరలు పెరిగిపోతాయి. వ్యాపారులు తాము చెల్లించిన వడ్డీ మొత్తాన్ని ఉత్పత్తి వ్యయం క్రింద లెక్కగట్టి వస్తువుల ధరలు నిర్ణయిస్తారు. అప్పుడు ప్రజలు ఆ వస్తువుల్ని మనుపటి కంటే ఎక్కువ ధరలకు కొనవలసి వస్తుంది. అందుకని ఇస్లాం ధర్మం అన్నిరకాల వడ్డీ లావాదేవీలను నిషేధించి దౌర్జన్యం, దురాక్రమణ, ధరల పెరుగుదలకు కారణమయ్యే ఒకపెద్ద ద్వారాన్ని మూసివేసింది.

కాని శోచనీయమైన విషయం ఏమిటంటే పాశ్చాత్య దేశాల అంధానుకరణ మూలంగా నేడు ముస్లింలలో కూడా ఆర్థిక వ్యవస్థ మొత్తం వడ్డీ మీదనే ఆధారపడి ఉంది. దాన్నుండి

బయటపడటానికి పాశ్చాత్య కీలుబొమ్మలైన ముస్లిం దేశాధినేతల తరపు నుండి ఎలాంటి ప్రయత్నాలూ జరగటం లేదు. అదే విధంగా ముస్లిం ప్రజానీకంలో కూడా ఈ వడ్డీ మహమ్మారి నుండి బయటపడాలన్న ఆసక్తి ఏమీ కనిపించటం లేదు. పైగా వారిలో చాలామంది బ్యాంకులు ఇచ్చే వడ్డీని తీసుకుని నిర్మొహమాటంగా తింటున్నారు. తామూ వడ్డీ ఖాతాదార్లుగా మారిపోతున్నారు.

వడ్డీ కోసం దివ్యఖుర్ఆన్ 'రిబా' అనే పదాన్ని ఉపయోగించింది. నిఘంటువులో దీనికి 'పెరుగుదల' అనే అర్థం వుంది. షరీఅత్ పరంగా ఒక లావాదేవీకి సంబంధించిన రెండు సజాతీయ వస్తువుల మధ్య వినిమయం జరిగేటప్పుడు ఏదో ఒకదానిలో ఉండే పెరుగుదలను లేక బాకీ తీర్చినప్పుడు అసలు వస్తువులో లేక నగదులో ఉండే పెరుగుదలను 'రిబా' అని అంటారు. ఇది రెండు రకాలుగా ఉంటుంది.

1) రిబల్‌ఫజ్ల్- అంటే రెండు సజాతీయ వస్తువుల వినిమయ సమయంలోనే ఒక దాని ప్రతిఫలం ఎక్కువగా తీసుకోవటం.

2) రిబన్నసీఅ- రెండు సజాతీయ వస్తువుల వినిమయం (బాకీ వ్యవహారంగా) జరిగిన నిర్ణీత కాలం తర్వాత ఏదో ఒకదాని ప్రతిఫలం ఎక్కువగా తీసుకోవటం.